
# తరుశాఖ

ఆదూరి వేంకట సీతారామమూర్తి



"బాబుగారి పరిస్థితి ఏం బాగాలే దండయ్యా" చెప్పాడు వెంకయ్య. వెంకయ్యను చూడగానే పరిస్థితి అర్థమై పోయింది. – ఇటువంటి కబురు ఏదో మోసుకొస్తాడని వూహించాను–

నా ముఖంలో ఏ భావమూ కన్పించకపోవడం వల్ల కాబోలు మళ్ళీ అతనే అన్నాడు.

"రెండురోజుల క్రితం డాక్టరు బాబొచ్చి చూసి వెళ్ళారు. నిన్న రాత్రి మళ్ళీ తిరగ బెట్టింది. బతకడం కష్టమేనంటున్నారు–"

అతను చెబుతున్న మాటలను మౌనంగానే వింటున్నాను – అప్రయత్నంగానే నాలో ఆలోచనలు ఉవ్వెత్తున లేస్తున్నాయి.

"తమర్ని వెంటనే రయల్దేరి ..." నసిగేడు –

"నువ్వుపద-వస్తున్నానని చెప్పు–" "అంటూ లేచాను–

పొలంలో దమ్ము చేస్తున్నారు– దగ్గరుండాల్సిన సమయమే. కానీ.. చక్రధరం కోసం వెళ్ళకతప్పదు. ఎక్కడవున్నా ఎంత అత్యవసర మైన పనివున్నా –

"ఏరించిని ఉన్న పాటున రమ్మన్నానని చెప్పు" అని పొలానికి మనిషిని పంపి బట్టలు మార్చుకుని ముందుగదిలో కొచ్చి కూర్చున్నాను. –

మనసంతా ఉద్వేగంగా వుంది –

చక్రధరం నేనూ చిన్ననాటి స్నేహితులమే అయినా స్వంత అన్నదమ్ముల్లా పెరిగాం. చదువులు పూర్తయి; జీవిత పథాలు వేరైనా ఒకరిమాట కొరకు గౌరవ మిచ్చుకుంటూ బతికాం. ఉద్యోగరీత్యా ఆంధ్ర దేశంలో అన్ని ప్రాంతాలూ తిరిగి చివరికి నాలుగేళ్ళ క్రితమే నాకు దగ్గరగా వచ్చి స్థిరపడ్డాడు యాభైఏళ్ళకే అనారోగ్యం అతనిని పూర్తిగా క్రుంగదీసింది – ఈ రెండు నెలల్లో యిది మూడో పిలుపు.

"చక్రధారంగారికి మళ్ళీ స్ట్రోక్ వచ్చిందా?" అడిగింది జానకి గదిలోకి వస్తూ.

అవునన్న ట్లుతలూపేను.

"పొలంపనిఏరించి చూసుకుంటు న్నాడుగా. మీరొకమారు వెళ్ళిరారాదూ"

"ఈ మారు ఏరించిని కూడ తీసుకు వెళ్ళాలనే అనుకుంటున్నాను.' ఆశ్చర్యంగా నాకళ్ళలోకి చూసింది జానకి. నేనేం మాట్లాడలేదు – నా మౌనానికి జానకి మరోలా భాష్యం చెప్పుకుందేమో మళ్ళీ ప్రశ్నించలేదు.

పొలం నించి ఏరించి వచ్చాడు – అతని బట్టలన్నీ మట్టి గొట్టుకుని వున్నాయి.– మనిషి చాల అలసినట్టు న్నాడు – అయినా విషయం చెప్పగానే 'సరే' అని బట్టలు మార్చుకుని నా వెంట బయల్దేరేడు–

బస్సులో కిటికీ ప్రక్క సీటు నాకు యిచ్చేసి తను మరోచోట కూర్చున్నాడు ఏరించి. బస్సు బయల్దేరటంతో నాలోని ఆలోచనలు పురులు విప్పేయి !

చక్రధరానికి చిన్నప్పుడే తండ్రి పోయాడు – ఉన్న బంధువులు అక్కరకు రాకుండా పోవడంతో అతని తల్లి అనసూయమ్మ కష్టపడి నాలుగిళ్ళలోనూ పనిచేసి చక్రధరాన్ని పెంచింది. వారిద్దరి జీవన విధానం చిత్రంగా అన్పించేది.

తొలికోడి కూతకే అనసూయమ్మ లేచి కొడుకును లేపేది. తను బిందె పట్టుకొని ఏటికి వెళ్ళేది. స్నానంచేసి శుచిగా తళతళలాడే బిందెతో మంచినీళ్ళను తెచ్చి నాలుగేళ్ళవారికి అందించేది – అప్పట్లో నెలకూ బిందెకూ రూపాయి పుచ్చుకొనేదామె. ఏరుకాస్త దూరంగా వుండటంవల్ల నైతేనేమి; బతికి చెడ్డ ఆమెస్థితిని చూసి జాలి పడ్డం వల్లనైతేనేమి; ఆమె శుచీ శుభ్రతవల్ల నైతేనేమి కాస్త కలిగిన వాళ్ళందరూ అనుసూయమ్మ చేతే మంచినీళ్ళు తెప్పించు కునేవారు. ఒకటి రెండు యిళ్ళలో వంటకూడా చేసేదామె. ఏ పనిచేసినాతన గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లని పనిచెసెది. కొడుకును చదివించింది. ఉద్యోగవంతుడ్ని చెయ్యాలన్నదే ఆమె ధ్యేయం. చక్రధరంకూడ చదువులో ఎప్పుడూ ఫస్టే వచ్చేవాడు– నేనెప్పుడూ ఏవరేజ్ స్టూడెంటునే – అయితే మా యిద్దరి మధ్యా ప్రాణస్నేహం. ఒక విషయాలొకరికి దాపరికం లేకుండా చెప్పుకొనే వారిమి.

ఆయేడాది ఎస్సెల్సి రిజల్సు వచ్చాయి – నేను పాసయ్యాను. చక్రధరం స్కూలుకి ఫస్టొచ్చాడు – నా చదువు పట్నం కాలేజీలో కొనసాగడానికి నిర్ణయమైంది – కానీ అన్ని మార్కులు తెచ్చుకున్న చక్రధరం చదువు ఆలోచనల్లోనే పడిపోయింది.

"కోరికైతే వుంది – కానీ పట్నం చదువంటే మాటలా ? అడుగు ముందుకు వేసేమంటే మరి వెనక్కు తీసుకో కూడదు" అన్నది అనసూయమ్మ. ఆమె పరిస్థితిని సానుభూతితో అర్థంచేసుకున్న కొందరు ధైర్యం చెప్పేరు– చక్రధరాన్ని గనక కాలేజీలో చేర్పించితే మొదటి టర్ము ఫీజు తను కడతానని నాన్నగారామెకు మాటిచ్చేరు –

•

ఎలాగైతేనేం. చివరి నిముషంలో చక్రధరం కూడా నాతోపాటు పట్నం వచ్చి కాలేజీలో చేరాడు. ఇద్దరం ఒకే గదిలో వుండేవారిమి. వారానికో, పదిరోజులకో అనుసూయమ్మ వచ్చి కొడుకును చూసి పోతుండేది – ఆవిడ మాటంటే చక్రధరానికి




వేదవాక్కు - నాకోసం మాత్రం ప్రతి ఆదివారం నాన్నగారు వచ్చి అవసరాన్ని చూసి వెళ్ళేవారు.

ప్రీ యూనివర్సిటీలో కూడా చక్రధరానికి ఫస్టుక్లాసే వచ్చింది- నాకు అతి కష్టం మీద సెకండ్ క్లాస్ వచ్చింది. నాన్నగారు నన్ను బియస్సీలో చేర్పించడానికి నిర్ణయించారు- చక్రధరానికి ఇంజనీరింగ్‌లో సీటు సులభంగా వచ్చేదే - కానీ అనసూయమ్మ వెనుకంజవేసింది -

"నాలుగేళ్ళంటే మాటలా? ఆ చదువుకి ఏ చిన్న ఉద్యోగమొచ్చినా గుట్టుగా బతుకుతాం" అంది - చక్రధరం కూడ తల్లి అభిప్రాయన్నే సమర్థించాడు- అదే కాలేజీలో డిగ్రీ చదివితే మెరిట్ స్కాలర్ షిప్‌తో పాటు హాఫ్ కన్సెషన్ కి తనురికమెండ్ చేస్తానని ప్రిన్సిపాల్‌గారు హామీ యివ్వడంలో చక్రధరం ఎట్టకేలకు డిగ్రీలో చేరాడు -

క్రమేణా చక్రధరం ఆలోచనల్లో మార్పురావడం గమనించేను.

ఓమారు క్లాస్‌లో ఓ సంఘటన జరిగింది- లంచవర్ తర్వాత మొదటి పీరియడ్ ఫిజిక్స్ క్లాసు. లెక్చరర్ రావడానికి రెండు నిముషాలవ్యవధి వుంది - కొద్దిమంది తప్ప క్లాసంతా యించుమించు హాజరైనట్లే - సరిగ్గా అప్పుడే సరోజ తన స్నేహితురాళ్ళతో పాటు లోపలికొచ్చి సీట్లో కూర్చోబోతూ; టక్కున లేచి, ముందుకు నడిచి, ముందు బెంచీలో కూర్చున్న చక్రధరం దగ్గరకొచ్చి; "మీ హేండ్ కర్చీఫ్ ఓ మారిస్తారా?" అని అడిగింది --

చక్రధరానికి ఆడపిల్లలతో మాట్లాడే అలవాటు లేదు --

"నాదా? .... నాదీ..." అంటూ నసిగాడు - అతగాడి పరిస్థితి నా కర్థమైంది. సరోజ బాగా పలుకుబడీ, డబ్బుగల ఇంజనీర్‌గారమ్మాయి. ఎప్పుడూ, చలాకీగా వుంటూ మగపిల్లల పైనే జోకులేస్తూ వుండేది-

'అవును మీదే - ఓ సారివ్వండి" అంది సరోజ.

'నాకర్చీవ్ అంత బాగుండదు !' అంటూనే జేబులోంచి తీసియిచ్చాడు- అంతే! ఆ కర్చీఫ్‌తో బ్లాక్ బోర్డుమీద లంచవర్లో ఎవరో చిలిపిగా రాసిన రాతలన్నీ చెరిపి; అలాగే

**నేనెందుకు రాస్తున్నాను?**

* కథైనా, నవలైనా, నాటకమైనా, సినిమా అయినా, చిత్ర లేఖనమైనా ప్రజల కోసమే! ప్రజల జీవితాలకు సన్నిహితగా వుండనిదీ, ప్రజల ఆదరణకు పాత్రం కానిదీ యే రచనా నిలువదు. పాఠకుణ్ణి మైకంలో ముంచి - పలాయన వాదంతో తప్పుదారి పట్టించే రచనలు సమాజ శ్రేయస్సుకు భంగం కలిగిస్తాయి. ఉదాత్తమైన యితివృత్తాన్ని - వాస్తవికతకు దూరం కాకుండా చిత్రించే రచనల వల్ల సమాజానికి మేలు కలుగుతుంది.

- అంగర సూర్యారావు.

భరాగో-అత్తలూరి సంకలనం నుంచి

అతడి డెస్కుమీద పడేసి, లెక్చరర్ రావడంతో తన సీట్లో కెళ్ళి కూర్చుంది. అంతా ఆమె చేష్టలకు నిశ్చేష్టుల మయ్యాము - చక్రధరం సరేసరి! అతని స్థానంలో మరొకరుంటే ఏమయ్యేదో ! ఎంత రభస జరిగి వుండేదో!

"నువ్వు వూరుకోకుండా వుండాల్సింది. ఆమె ఆగడాలకు హద్దుండాలిగా!" అన్నాను ఆ సాయంత్రం.

"పోన్లే - ఆడపిల్ల"- అనేసి వూరుకున్నాడు చక్రధరం.

ఆ సంఘటన జరిగిన కొద్దిరోజులకే సరోజ చక్రధరంతో కావాలని మాటలు కలిపి మాట్లాడ్డం ప్రారంభించింది - అందం, చలాకీతనం వున్న సరోజ తెలివీ సంస్కారం వున్న చక్రధరంతో మాట్లాడ్డం; చనువుగా తిరగడం అందరికీ కన్నుకుట్టేది -

చదువులో ముందుంటూనే చక్రధరం మిగిలిన విషయాల్లోకూడ చురుకుగా వుండేవాడు. డిబేట్స్‌లో పాల్గొంటూ బహుమతులందు కొనేవాడు. కాలేజీ మేగజైన్‌లో అతని కవిత అచ్చయితే తెలుగుక్లాసులో లెక్చరర్‌గారు నలుగురి ముందూ మెచ్చుకున్నారు - 'ప్రయత్నిస్తే మంచి కవిత్వమే రాయగలవ్' అంటూ ధైర్యం చెప్పేరు.

డిగ్రీ రెండో సంవత్సరం కూడ పూర్తయింది. నలుగుర్నీ ఆట పట్టించే సరోజ సీరియస్‌గా మారిపోయింది - ఆమె ప్రవర్తనలో చక్రధరం పట్ల యిష్టమున్నట్లు కన్పించేది - వారిద్దరి గుర్ంచీ నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడుకునేవారు. ఆ సంగతే ఉండబట్టలేక చక్రధరంతో అంటే - అనుకున్నంత మాత్రాన అసత్యాలు సత్యాలౌతాయా? స్నేహం వేరు. ప్రేమ వేరు. నాకు తెల్సినంతవరకూ మామధ్య నూటికి నూరుపాళ్ళు స్నేహమే" అని తేల్చేశాడు.

మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టిన కొద్దినెలలకే చక్రధరం తల్లి లంగ్ కేన్సర్‌తో చనిపోయింది.

ఆ బాధను మౌనంగానే భరించాడు - తల్లి దగ్గర వున్న కాసింతసామానూ తీసుకొని అతను శాశ్వతంగా పట్నం వచ్చేస్తుంటే ఆపల్లెలో కలిగిన వారంతా తలా కొంత ఆర్థిక సాయం చేశారతనికి. సరిగ్గా అదే సమయంలో చక్రధరం రాసిన ఓ కవితకు ఒక ప్రముఖ పత్రికలో మొదటి బహుమతి వచ్చింది.

చూస్తుండగానే చక్రధరం జీవితం ఎంతగా మారిపోయింది. అతని అలవాట్లు అభిరుచులు కూడ కొత్తగా అన్పించసాగేయి. మాటల్లోనూ రాతల్లోనూ పరిణతి కన్పించేది. లేమిలో పుట్టడం, కష్టాల్లో పెరగడం వంటరిగా జీవితంలో మిగిలి పోవడం యీ మూడు అవస్థలు అతని జీవిత గమ్యాన్ని అసాధారణ కోణం వైపు తిప్పేవేమోనని అన్పించేది-

అతని మౌనంలో రోదన; అతని చూపుల్లో పట్టుదల; చేతల్లో నిజాయితీ కన్పించేది.

కాలేజిలో చదువుతూనే ట్యుటోరియల్ కాలేజిలో పార్టుటైం పనికికుదిరేడు- సంపాదన, చదువు, రచనా వ్యాసంగం - కాలం ఎవరి జీవితంలో ఎటువంటి మార్పులు తెస్తుందో వూహించలేం.

బస్సు ఆగింది -

స్టాండులోదిగి, రిక్షా మాట్లాడేను. మరోపదినిమిషాల్లో ఆయింటి ముందున్నాం- అనుకున్నంత భయంకరంగా లేదు యింటి ముందు వాతావరణం- నన్ను చూడగానే కళ్ళనీళ్ళొత్తుకుంటూ 'రండన్నయ్యగారు' అంటూ లోపలికి దారి తీసింది చక్రధరం భార్య. మనసులో కెరటాలు కెరటాలుగా పుట్టుకొస్తున్న దుఃఖం ఆమె కళ్ళలో ప్రతిబింబిస్తూంది.

మంచంమీద చక్రధరం మంచాని కంటుకుపోయి పడుకుని వున్నాడు - అది ఏస్థితో అతని ముఖం చూస్తేనే తెల్సిపోతుంది - మంచానికి దగ్గరగా వున్న కుర్చీలో కూర్చున్నాను- అతనిని ఆస్థితిలో చూస్తుంటే మనసంతా భారమైపోయింది.

'ఏమన్నారు డాక్టరుగారు?' అడిగాను. గొంతు పెగుల్చుకొని "ఇక చెప్పాల్సినవీ, చెయ్యాల్సినవీ ఏమీ లేవని దేవుడి మీద భారం వేసేసారు." అన్నదామె బొంగురుపోయిన గొంతుతో. తల్లికి కాస్త వెనుకగా కవిత, విద్య నిల్చుని వున్నారు- వారిముఖాలు కళా విహీనంగా వున్నాయి.

"రాత్రంతా మెలకువగానే బాధపడ్డారు. ఉదయం, నించే యీ మగత. మెలకువ వస్తే కాస్త గొంతు తడుపుకోవడం.. అంతే!" ఆమె చెబుతోంది -

"ఇప్పుడేం కదిలించవద్దు. లేస్తే నన్ను పిలవండి' అంటూ వీధి వరండాలో నున్న కుర్చీలో కూలబడ్డాను. రెండుగ్లాసులనిండా చిక్కని మజ్జిగ తీసుకు వచ్చి మా యిద్దరికీ యిచ్చింది కవిత. మజ్జిగ తాగేక బయటకు వెళ్ళాడు విరించి - నేను మళ్ళీ ఆలోచనల్లో కూరుకుపోయాను.


డిగ్రీ పూర్తయ్యాక మాదారులు వేరయ్యాయి.

ఎవరో అనాథ అమ్మాయిని చేరదీశాడని; ఆమెతోనే వుంటున్నాడనీ విని ఆశ్చర్యపోయాను. విషయం తెల్సుకోడానికి చక్రధరం దగ్గరకు బయల్దేరాను - నేను విన్నది నిజమేనని అక్కడి పరిస్థితి చూశాక తెల్సింది - వయసు ఇరవై లేపే వుండొచ్చు అమ్మాయికి. అసలు పేరు బంగారమ్మట - చక్రధరం మాత్రం స్వర్ణ అని పిలుస్తున్నాడు. చెప్పుకోదగ్గ అందంగానీ, స్త్రీ సహజ సౌకుమార్యంగాని, సంస్కారంగాని వున్నట్టు కన్పించలేదు అమ్మాయిలో. చక్రధరం చేసేది అతి చిన్న ఉద్యోగం - ఉండేది చాలీచాలని గదిలో. ఆ యిరుకు జీవితంలోకి యీ అమ్మాయిని ఎలా తీసుకువచ్చాడో; అందుకు ఎదురైన పరిస్థితులేమిటో అర్థంకాలేదు. కానీ బాధనిపించింది - ఆసాయంత్రం పార్కులో అదే సంగతి అడిగాను.

"ఏమిట్రా యిది చక్రధరం. నే విన్నదీ, చూసినదీ నిజమేనా?" అని. నా ప్రశ్నకు సమాధానంగా కాక తన నిర్ణయాన్ని సూటిగా చెప్పేడు-

ఆరోజంతా ఎంతలా విలవిల్లాడిపోయానో! పెరిగిన పరిస్థితులు అట్లాంటివి కావటం వల్లనేమో చక్రధరం చిన్నప్పటి నుండి పరోపకారం గానే వుండేవాడు- కాస్త ఎదిగాక ఒక సంస్కర్తలో వుండే లక్షణాలు లీలగా గోచరమయ్యాయి. దానికి తోడు కవిత్వం రాయడం; పుస్తకాలు చదవడం; జీవితాన్ని పరిశీలించే విస్తృత పరిధిలోకి అతని ఆలోచనలు మళ్ళడం నాకు ఆనందాన్నీ ఆశ్చర్యాన్నీ కలిగించ సాగేయి. అయితే స్త్రీ జనోద్ధరణ అన్నది వేశ్యావృత్తిలోని స్త్రీలను పెళ్ళి చేసుకుని సంసారులను చేయడం ఎంతవరకూ సమంజసమో, సాధ్యమో నా ఆలోచనా పరిధిలోకి మాత్రం రాలేదు.

సమాజంలో ఎంగిలాకుల్లా మారిన వేశ్యాస్త్రీలపై జాలి వుండొచ్చు. కానీ ....? నా



రైలు స్టేషన్లో, బండి లేటుకదా అని ఒక లావుపాటి ఆసామీ నిద్దరోతున్నాడు. ఒక జేబుదొంగ అతని ప్యాంట్ జేబులో చెయ్యిపెట్టే వేళకి అతను అట్నుంచి ఇటు ఒత్తిగిలడం సంభవించింది.

అంతే. ఆచెయ్యి మరి రాలేదు. ఇద్దరు పోలీసులు సాయంబట్టి విడిపించారు చివరికి.

ఆలోచనల్ని చక్రధరంతో పంచుకోకుండా వుండలేకపోయాను.

"నీ చదువును గురించీ; నీ భవిష్యత్తును గురించీ మీ అమ్మగారు ఎన్ని కలలుగన్నారో నీకు తెల్సు- ఎంత శ్రమించారో నాకూ తెల్సు. నీ యీ నిర్ణయం ఆమె ఆత్మను క్షోభపెడ్తుందేగాని శాంతిని మాత్రం యివ్వదు- బాధ్యతగల కొడుకుగా నువ్వు మారోమారు ఆలోచిస్తేనే బావుంటుంది" అన్నాను -

" నా మనసుకు నచ్చినట్టు నడుచుకోవడమే నా కిష్టం. నా ఇష్టాన్నెప్పుడూ మా అమ్మ కాదనలేదు - జీవితాన్ని అన్ని కోణాల్లోనూ దర్శించిన మా అమ్మకు సంకుచితమైన ఆలోచన లున్నాయని నేననుకోను."

ఆ మాటలవల్ల అతని నిర్ణయం ఎంత బలమైనదో వూహించగలిగాను.

అక్షింతలు వేయడం తప్ప ఆ జంటను మనస్ఫూర్తిగా ఆశ్వీరదించ లేకపోయాను. ఓ ఏడాదిన్నర పాటు మా మధ్య ఉత్తరాల్లేవు. ఏ ఉగాదికో; సంక్రాంతికో ఒకట్రెండు గ్రీటింగ్ కార్డులు. అటూ ఇటూ - అంతే !

ఎమ్మెస్సీ పూర్తయిన కొత్తల్లో లెక్చరర్ పోస్టుకోసం ఇంటర్వ్యూకి వెళ్ళవలసి వచ్చి చక్రధరానికి ఉత్తరం రాశాను. - స్వయంగా స్టేషన్ కొచ్చి రిసీవ్ చేసుకున్నాడు - నేను హోటల్లో దిగుతుంటే ఆశ్చర్యపోయాడేగాని అభ్యంతరం చెప్పలేదు - అతని ఉద్దేశం

కనిపెట్టి నేనే అన్నాను.

"మరేం అనుకోకు. ఇంటర్వ్యూ అయ్యాక మీ యింటికొచ్చి చూసి వెళ్ళాను. నీ భార్య క్షేమమేనా ? ... అన్నట్లు ... పిల్లలా?

"ఆఁ ఒక అబ్బాయి."

ఆ సాయంకాలం చక్రధరం యింటికి వెళ్ళేను. అంతకు ముందు వుండేగది కాదు – ఓ ఇరుకు సందులో రెండు గదుల చిన్న పోర్షన్ అది– ఇంటి పరిసరాలు బాగాలేకపోయినా అతని పోర్షన్ ఫర్వాలేదు. ముందుగదిలో రెండు కుర్చీలూ, ఒక మంచం, ఒక టేబిలు వున్నాయి. బుక్ షెల్ఫ్ లో శ్రీ శ్రీ, చలం, బుచ్చిబాబు, వీరేశలింగం, గురజాడ, తిలక్ రచనలున్నాయి.

రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చి కూర్చున్నాడు. మనిషికాస్త తగ్గేడు– జుట్టుకూడ పల్చబడింది – ముఖంలో కళకూడా తగ్గినట్లు కన్పించింది – ఆర్థికపరమైన యిబ్బందులు ఎటువంటి మనిషినైనా కృంగదీస్తాయి అని సరిపెట్టుకున్నాను –

నా గురించిన వివరాలడిగేడు –

" వాడే మా బాబు" అంటూ మంచంమీద పడుకున్న బాబు వంక చూపించాడు.


ఆవిడ కనబడదేం?' అడగాలను కుని వూరుకున్నాను –

నా ఉద్దేశం గ్రహించినట్టు 'ఆవిడకి స్నేహితులెక్కువ. ఎవరింటికో వెళ్ళింది. ఈ పాటికి వచ్చేస్తూ వుండాలి' అన్నాడు –

చదువుకొనసాగించమనీ; కాస్త మెరుగైన ఉద్యోగంలోకి మారమనీ చెప్పాలనుకున్నాను. తను రాసిన కవితలూ; అచ్చయిన రచనల కటింగ్సూ తెచ్చి నా ముందుంచాడు....

అతని కవితల్లో అస్పష్టత; ఇతర రచనల్లో సాంఘిక సంస్కరణా ధోరణులు గోచరించాయి నాకు. ఏ రచయితకిగాని, కవికిగాని, అతని రచనలు పుస్తకాలుగా వెలువడి తేనే గుర్తింపు వస్తుంది అతని రచనలను సమకాలీన సాహిత్యంతో అంచనా వేయడానికీ, విలువ కట్టడానికీ వీలుకలుగు తుంది – ఆ విషయమే అంటే –

"నిజమే కానీ కవిత్వాన్నీ సాహిత్యాన్నీ అమ్ము వేసేందుకు ప్రచురణ కర్తలు ముందుకు రావటంలేదు. – ఏ సాహితీ సంస్థో, ప్రభుత్వమో



*రచయిత్రి: నా సీరియల్ నవల గురించి ఏమేనా అభిప్రాయాలొస్తున్నాయా?*

*ఎడిటర్: ఇంతకు ముందే మీ పేరుగల ఒక అమ్మాయొచ్చి ఈ నవల తను రాయలేదని ప్రకటించమని ఎడ్రస్ ఇచ్చి వెళ్ళింది.*

అటువంటి రచనలను ప్రచురించి రచయితలను ఆదుకోవాలి. సాహితీ సంస్థలు నిలవటమే కష్టంగా వుంది – ఇక ప్రభుత్వ సహాయం కూడ అవసరమైనంత వుండటంలేదు–" అన్నాడు –

నేను తిరిగి వచ్చేసేవరకూ చక్రధరం భార్య ఇంటికి రాలేదు. ఇంటర్వ్యూలకు వెళ్ళొస్తున్నా ఉద్యోగమొచ్చే మార్గం కన్పించలేదు నాకు. కులం, డబ్బు, రికమండేషనూ – వీటిమధ్య మనిషి తెలివితేటలూ, విలువలూ ఎందుకూ కొరగాని వౌతున్నాయనిపించింది.

రెండేళ్ళు నిరుద్యోగంతో పోరాడేక గాని నాన్నగారు చెప్పింది తలకెక్కలేదు. వ్యవసాయమూ, పౌల్ట్రీ – వీటి విషయాలు స్వయంగా చూసుకొంటూ నాన్నగారికి చేదోడు గా వుండాలనే నిర్ణయాని కొచ్చాను. అత్తయ్యగారమ్మాయి జానకితో పెళ్ళి; మరో ఆరునెలలకే నాన్నగారు పోవడం – జీవితంలో పూర్తిగా స్థిరపడేలా చేశాయి.

ఈ మధ్యకాలంలో చక్రధరానికీ, నాకూ మధ్య ఉత్తరాలు దాదాపు లేనట్లే. ఓరోజు చక్రధరం నుండి కవరొకటి వచ్చింది. ఉత్తరం చదివితే మనసంతా వికలమై పోయింది–

సారథీ,

మొదట్నుంచి నీ మాటలు పెడచెవిన పెడుతూనే వున్నాను – అందుకే అనుభవిస్తున్నానేమో ! స్వర్ణ విషయంలో నీ భయాలు నిజమే అయ్యాయి. ఒక జీవితానికి అలవాటు పడ్డ వారిని మరో జీవితంలోకి మళ్ళించడం అంత సులభంకాదేమో ! చిరిగిన గాలిపటానికి దారం ఆధారమున్నా గిరికీలు కొడుతుందేగాని నిశ్చలంగా ఎగరలేదన్నది అనుభవంలో గాని తెలిసి రాలేదు– స్వర్ణ మాతృత్వాన్ని కూడ కాదని డబ్బువెంట వెళ్ళిపోయింది – బాబు తోడుగా వున్నా అర్నెల్లుగా వంటరితనం – ఓమారు రాగలిగితే సంతోషిస్తాను

– చక్రధరం

వెంటనే బయల్దేరాను.

పరామర్శించడంలో; సానుభూతి మాటలు కురిపించడాలూ నాకు చాతకావు. ఐతే, నా అంతరంగంలోని ఆశ, ఆలోచన వేరు. జరిగిందాన్ని గురించికాక జరగబోయేది ఆలోచించడం నాకలవాటు. నేను వెళ్ళి కొంత సాధించాననే అనుకోవాలి.

నా బలవంతంపైనే అయినా జర్నలిజంలో డిప్లొమా చేయడంవల్ల ఏడాది తిరగకుండానే పేపరాఫీసులో ఉద్యోగమొచ్చింది చక్రధరానికి.

మనసుకు నచ్చిన పని మనిషికి కొండంత బలాన్నీ ధైర్యాన్నీ యిస్తుందన్నది చక్రధరాన్నిచూస్తేనే తెలుస్తుంది. అలామారి పోయాడు.

ఆ తర్వాత నేను చక్రధరాన్ని కల్సినపుడు అతనిలో ఆ మార్పును గమనించాను. మంచి వాతావరణంలో యిల్లు., బాబును చూసుకోడానికో ముసలమ్మ –, సొంతంగా ఒక పుస్తకాన్ని కూడ అచ్చు వేయించాడు.

అతనిలోని కొత్త ఉత్సాహం చూసి ఎన్నాళ్ళుగానో నా మనసులో వున్న మాటను ఆ రాత్రి అతని ముందుంచాను –

మొదట చక్రధరం ఏం మాట్లాడలేదు – క్షణం ఆగి అన్నాడు– "నాయీ పునర్జన్మకి కారకుడివి నువ్వు. యు ఆర్ రియల్లీ ఎ ఫ్రెండిన్ నీడ్ – నీకేది మంచిదని తోస్తే అది నాకూ మంచిదే అవుతుంది' అన్నాడు – ఆ మాటల్లో నిరుత్సాహంలేదు– జీవితంపట్ల నిర్లిప్తత లేదు. నా మాటల మీద అతనికున్న గురి, అభిమానమే కన్పించింది –

'సహాయపడ్డం, ఉద్ధరించడం, సంస్కరించడం – ఏరూపంలో నైనా ఉండొచ్చు – నువ్వీపని చేయడంవల్ల ఒక సంస్కార హీన కుటుంబంలోని అమ్మాయికి కొత్త జీవితాన్నిచ్చిన వాడి వౌతావు. ఒకనిస్సహాయ వృద్ధదంప

తులకు కన్యాదాన ఫలమిచ్చిన వాడివౌతావు. నాగావళి నాక్కు తెలినంతవరకూ సుగుణాలరాసి. ఆమె నీ జీవితం లోకి ధనధాన్యాలు తీసుకు రాలేక పోవచ్చు. కానీ తరగని వెలుగుని తప్ప తెస్తుంది - ఆలోచించు." అన్నాను.

"నామంచి కోరేవాడి నువ్వు - నా వల్ల మరొకరికి మంచి జరుగ తుందంటే నాకు సంతోషమే- నీ యిష్టం." అన్నాడు -

"అయితే మరొక త్యాగం కూడ నువ్వు చేయాలి. అదిమాత్రం కేవలం నాసంతోషం కోసం" అంటూ విషయాన్ని బయటపెట్టేను - ఏ భావమూ కన్పించనియని చూపుతో నా కళ్ళలోకి ఓ క్షణం మౌనంగా చూసేడు - తర్వాత నిలదొక్కుకొని ఓ నిర్ణయంకొచ్చి 'సరే నీ యిష్టం' అన్నాడు.

చక్రధరం పెళ్ళి దైవసన్నిధిలో నిరాడంబరంగా జరిగిపోయింది. నాగావళి తండ్రి ఏనుగెక్కినంత సంబర పడిపోయాడు. అందరి ముఖాల్లోనూ ఆనందం తాండవించడం చూస్తే నాకు నిజంగా సంతోషమని పించింది.

"మావయ్యగారూ నాన్నగారికి మెలకువ వచ్చింది-" అంటూ వచ్చింది కవిత. ఆలోచనలను అక్కడితో ఆపి లోపలికెళ్ళాను - నా వెనకే విరించి కదిలాడు.

జీవంలో వున్న చక్రధరం కళ్ళలో మాత్రం జీవం కన్పించలేదు. అందరి వంకా చూస్తున్నాడు. ఏ భాషకీ భావనకీ అందని చూపది. నేను వచ్చినట్లు నాగావళి అతని చెవిలో చెప్పింది - ఆశగా నావైపు కనుగుడ్లను కదిల్చాడు. నన్ను గుర్తుపట్టి ; కళ్ళతో నే పలకరించాలని తాపత్రయ పడ్డాడు - ఆ కళ్ళపై పన్నటి నీటి పొర జేరింది.

"ఎలా వుంది చక్రీ" అన్నాను అతని దగ్గరగా వంగి. మనసులో పేరుకుపోయిన దుఃఖాన్ని కరిగించబోయేడు-

"భయంలేదు- నీకేంకాదు. మేమువ్నాంగా" అన్నాను సహ ఇదా యిస్తూ. నా మీదనుంచి చూపులు మళ్ళించి విరించి వేపు చూసి; ఎవరన్నట్లు ప్రశ్నించబోయి; 'అవునా?' అన్నట్లు తలకదిలిచేడు - దాని భావం ఒక్కటే నాకే అర్థమైంది అవునన్నట్లు తలూపేను - చక్రధరం చేతులు చాచేడు అతని చేయందుకుని, విరించి చేతిని కలిపి 'అవును విరించే 'అన్నాను అతనికే తెలిసేలా.

చక్రధరం దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. మంచికి ఇరువైపులా చేరిన కూతుళ్ళను దగ్గరకు తీసుకున్నాడు. నాగావళి వంకజాలి చూపులు చూసేడు. అంతే! అతనిలోంచి హంస లేచిపోయింది.

క్షణం క్రితం వరకూ నిశ్శబ్దంతో కరుడుగట్టిన ఆవాతావరణం ఏడ్పులతో మార్మోగి పోయింది.

దుఃఖం నించి కొస్త తేరుకున్నాక కర్తవ్యం గుర్తొచ్చిన దానిలా నా వంకే చూసింది నాగావళి.

"ఇక జరగాల్సిందేదో చూడాలి నాగావళి" అన్నాను నెమ్మదిగా.

"ఎలా అన్నయ్యగారూ? మరో దిక్కులేని ఆడపిల్ల తల్లిని " అంది బొంగురు బోయిన గొంతుతో.

"ఆ విషయం నాకొదిలేయ్. విరించి వున్నాడుగా" అన్నాను - నమ్మలేనట్లు నావంక ఆశ్చర్యంగా చూసింది. ఆ చూపులో కృతజ్ఞత కూడా వుంది.

* * *

పడమటి వెలుగు తగ్గి, సంధ్యచీకట్లు ముసుకుంటున్నవేళ- చక్రధరం తుది శ్వాస విడిచిన ప్రదేశంలో గదిలో వెలిగించిన దీపంనిశ్చలంగా వెలుగుతోంది !

చక్రధరం జీవితంలో జరిగిన సంఘటనలు జరిగినట్టే చెప్పి ఆగేను. కాస్సేపు మౌనం తర్వాత పెదవి విప్పింది నాగావళి.

"సముద్రమంత గంభీర స్వభావు లాయన - గుండెల్లో బడబాగ్నినికూడా దాచుకోగల మనో నిబ్బరముందాయనకు ఆయన మాటల్లో ఎప్పుడేనా గతం కదిలితే విషాదం ధ్వనించేది ! కానీ ఆ పరిస్థితులునీ, తవ్వి ఆయనను బాధించడం యిష్టంలేక మౌనంగానే వుండి పోయానిన్నాళ్ళూ. ఒక బాబుకూడ వుండేవాడని అర్థమైంది - కానీ ఆబాబే యీ విరించి రూపంలో యీ రోజిలా వస్తాడని అనుకోలేదు" - నాగావళి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"నేను చేసింది తప్పో ఒప్పో కూడా అప్పట్లో నే నాలోచించలేదు నాగావళీ. తెగిన గాలిపటంలాంటి ఒక జీవితానికి ఆలంబనను ఏర్పరచాలన్న తపన మాత్రం ఆవేశంలో కలిగింది. దానికి చక్రధరం అనుమతీ లభించింది - బిడ్డలు లేని మాకు విరించే ఒక బిడ్డ అయ్యాడు. అతనిని నా ఆశయం మేరకు విద్యావంతుడిని చేశాను. ఈ ఏడాదితో ఇంజనీరింగ్ పూర్తవుతుంది" అన్నాను సంజాయిషీ యిచ్చుకున్నట్లుగా.

"ఏమైతేనేం - నేను దురదృష్ట వంతురాల్ని" అంది నాగావళి కళ్ళొత్తుకుంటూ.

" మాయింటి ఆవరణ లోకి పెరిగినా; విరించి మీ చెట్టు కొమ్మే నాగావళీ- " అంతకంటే ఎలా చెప్పాలో తెలియక, మెల్లగాలేచి వీధివైపు అడుగేయబోయాను.

ఎదురుగా విరించి - అతనికి కాస్త వెనుకగా కవిత, విద్య !

వారి చూపుల్లో ఆర్ద్రతతో కూడిన కృతజ్ఞత - మనసుల్లో ఉవ్వెత్తున ఎగిసే మమతాను రాగాలు !

